# బదిలీ

- బద్దిగం పాండురంగారెడ్డి



ఆఫీసుకు చేరుకునేసరికి పది నిముషాలు లేటైంది. కిక్కిరిసిన బస్సులు, స్కూటర్లు, ఆటోలు అన్నీ బయల్దేరే సమయం ఒక్కటే. అందరికీ త్వరగా గమ్యం చేరుకోవాలన్న ఆత్రమే. ట్రాఫిక్ జామ్ కాక ఏమవుతుంది?

సెక్షన్‌వైపు నడుస్తుంటే అటెండర్ వెంకటేశ్ ముసిముసిగా తనలో తను నవ్వుకుంటూ రావడం కనిపించింది.

'ఏమిటో విశేషం?' అనుకుంటూ నా సీటువైపు నడిచాను. పక్క సీటులో గుర్నాథం కునికిపాట్లు పడుతున్నాడు. బహుశా వెంకటేశం నవ్వుకి ఇదే కారణమై వుంటుంది. రోజూ వున్నదేగా అనుకుని టేబుల్‌పై ఫైల్స్ సరిచూసుకోసాగాను.

గుర్నాథం టిఫిన్ లాగిస్తున్నాడు. ఆఫీసుకు పాతిక గజాల దూరంలోనే ఇల్లు. ఆఫీసు టైంకి పది నిముషాల ముందు బయల్దేరినా టైంకి చేరగలడు. అయినా సరే రోజూ ఆఫీసుకు వచ్చాకే టిఫిన్ కార్యక్రమం ప్రారంభిస్తాడు. రాగానే కాసేపు దైవస్తుతి చేసుకుంటూండగానే నిద్ర ముంచుకొస్తుందతనికి. ఇతగాడు మాత్రం కళ్లు సగం సగం మూసి తెరుస్తుంటాడు. ఒకసారి దిక్కులు పరికించి ఎవరూ గమనించకపోతే నిశ్చింతగా ఉంటాడు. ఆఫీసరుగారొచ్చినా ఎదురుగా కాగితాలు చదువుకుంటున్నాడనే అన్పించేలా కళ్ళు వాల్చి ఉంటాయి.

ఇక ఒంటిగంట దాటిందంటే లంచ్ టైం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటాడు గుర్నాథం. ఎదుటివారి గురించి వ్యంగ్య విమర్శలు చేయడం అతని ప్రత్యేకత.

పనున్నా లేకపోయినా ఒసారి ఆఫీసర్‌గారి గదికి వెళ్లి బుద్ధిమంతుడిగా ఆయన ఎదుట నటిస్తాడు. అయిదయ్యేవరకూ నిద్రపోతాడు. ఆఫీస్ టైం మరో పావుగంట ఉందనగా మొహం కడుక్కుని వచ్చి ఫైల్స్ సర్దేసి వెళ్లడానికి తయారవుతాడు.

ఈ గుర్నాథం గొడవ ఈనాటితో అయ్యేది కాదులెమ్మని అర్జంట్ ఫైల్ ఓపెన్ చేసాను. చాలా తప్పులున్నాయి. సరిదిద్దాల్సిన గుర్నాథం నిద్రమత్తులో అన్నీ వదిలేసాడు.

***

మర్నాడు నేను ఆఫీసుకు వచ్చేసరికి సెక్షనంతా కోలాహలంగా వుంది. సంగతేమిటని విచారిస్తే గుర్నాథాన్ని బ్రాంచ్ ఆఫీసుకు బదిలీ చేసారని తెలిసింది.

ఎండిగారు రాగానే ఆయన ఛాంబర్‌లోకి వెళ్లి భోరుమన్నాడు గుర్నాథం.

"అదేంటయ్యా! నువ్వే ట్రాన్స్‌ఫర్ కావాలని కోరావు కదా" అన్నాడు ఎండిగారు.

"నేను కోరడం ఏమిటండీ. ఈ ఉద్యోగంలో ఉన్నంతవరకూ ఈ ఆఫీసులోనే, ఈ సెక్షన్‌లోనే తప్ప మరెక్కడా పని చేయను" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"పని చేసేవాడికి ఏ సెక్షనైతే ఏమిటయ్యా? అయినా ఇదిగో నీవిచ్చిన అప్లికేషన్ నువ్వే చూడు" అంటూ అందించారు ఎండిగారు.

హెడ్ ఆఫీసు నుండి బ్రాంచ్ ఆఫీసుకు బదిలీ చేయమని అప్లికేషన్ రాసి వుంది. చేతి రాత తనదే. కింది సంతకమూ తనదే. ఇది ఎలా జరిగింది?

"గుర్నాథం! ఇప్పుడు మనం చేసేదేమీలేదోయ్. ప్రస్తుతానికి వెళ్లి జాయినవ్వు. తరువాత నిన్ను నా సెక్షన్‌కు రప్పించుకుంటాను."

"అక్కడ నేను ఎన్నిరోజులు ఉండాల్సి వుంటుంది సార్" ఏడవబోయి ఆగిపోయాడు గుర్నాథం.

"కనీసం ఆర్నెల్లు, సంవత్సరం" అంటూ రిలీవింగ్ ఆర్డర్ అందించాడు ఎండిగారు.

మిత్రులంతా ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. కృతజ్ఞతలు చెప్పబోయిన గుర్నాథానికి గొంతు పూడుకుపోయి మాటలు రాలేదు దుఃఖంతో.

"బీ రిలాక్స్. డోన్ట్‌వర్రీ. అయినా పని చేసుకుని బతికేవాళ్లం. ఏ బ్రాంచి అయినా ఏముందిలే" ఓదార్చారు ఎండిగారు.

"కాద్సార్. ఆ బ్రాంచ్ ఇన్‌చార్జి చండశాసనుడు. ఒక్క రోజంటే ఒక్కరోజు కూడా అక్కడ నేను పని చేయలేను సార్" అంటున్న గుర్నాథం కళ్లు ఆగకుండా వర్షించసాగాయి.

అందుకు అసలు కారణం అర్థమైన కొలీగ్స్ ముసిముసిగా నవ్వుకున్నారు గుర్నాథం చూడకుండా.

మర్నాడు బ్రాంచ్ ఆఫీసులో జాయినయిన గుర్నాథానికి తన అప్లికేషన్ కథ ఎలా జరిగిందో ఎంత ఆలోచించినా అర్థంకాలేదు. ఎవరో ఫ్రెండ్ అడిగితే ఒకరోజు సెక్షన్ బదిలీ కోసం అప్లికేషన్ రాసి పెట్టాడు గుర్నాథం.

మిత్రుడు రాకపోయేసరికి అది అతని ఫైల్లోనే ఉండిపోయింది. ఓ రోజు కునికిపాట్లు పడుతూ నిద్రమత్తులో తనే సంతకం పెట్టాననీ, అది ఛైర్మన్ వద్దకి వెళ్లాల్సిన ఫైల్ కనుక అది సరాసరి ఆయనకే చేరిందని, ఆయన బదిలీకి అంగీకరిస్తూ సంతకం చేసారనీ అతనికి అర్థం కాలేదు ఈనాటివరకూ.

★